క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: వేసవి నేపథ్యంలో స్థానిక నాగుల కట్ట వద్ద మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు.మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు శ్రీనివాసరావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. మానవతా సంస్థ సేవలకు తనవంతు సహకారంగా సముద్రాల శ్రీనివాసరావు రూ.10వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడు జీవీ సుబ్బారెడ్డి, కోశాధికారులు మల్లికార్జునరావు,మరళీమోహన్‌రెడ్డి, సభ్యులు శివశంకర్‌రెడ్డి, ఎల్‌ఐసీ రామసుబ్బారెడ్డి, కాల్వ నాగేశ్వరరావు, వెంకటసుబ్బారెడ్డి, సహదేవరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ



బాధ్యతలు చేపట్టిన నాగకుమార్

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా నాగకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడే పనిచేసిన ఈయనను ఎనిమిదినెలల క్రితం చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు.అప్పటి నుంచి కార్యాలయ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కొనసాగుతున్నారు. నాగకుమార్‌ను తిరిగి ఇక్కడికి బదిలీ చేయడంతో విధుల్లో చేరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని రెండవ గ్రామ సచివాలయ పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసానిరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆయా కాలనీల్లో ప్రతి గడపను సందర్శించి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తారన్నారు.వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మండలస్థాయి అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈబీసీ నేస్తం పథకానికి 804 మంది అర్హులు

కొలిమిగుండ్ల: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో ఈబీసీ నేస్తం పథకం కింద 804 మంది అగ్రవర్ణాలకు చెందిన రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమతో పాటు ఇతర ఓసీ సామాజిక వర్గాలకు చెందిన పేద మహిళలకు లబ్ధి చేకూరిందని ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మార్కాపురంలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో రూ.15వేలు చొప్పున జమ చేశారన్నారు.

రోడ్డు ప్రమాదంతో ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్: మండల పరిధిలోని గోసానిపల్లె సమీపంలో ఎదురెదురుగా ఆటో బైకు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలు అయ్యాయి. డోన్ నుంచి కొచ్చెర్వు వైపు వెళ్తున్న ఆటో గోసానిపల్లె వైపు నుంచి డోన్ వైపు వస్తున్న బైకు ఢీకొనడంతో బైకుపై ఉన్న చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన పక్కీర, అనంతపురం జిల్లా గుత్తికి చెందిన రామాంజనేయులుకు తీవ్రగాయాలు అయ్యాయి. వీరిని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్సల అనంతరం కర్నూలుకు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

ఉమర్ మసీద్ కమిటీ ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లెరూరల్: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న ఉమర్ మసీద్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కమిటీ పెద్దల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ఓబులరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఓబులరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముస్లిం సోదరుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఇక్కడ ఉన్న ముస్లిం శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి రూ.69 లక్షల నిధులు మంజూరు చేయించారని, పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో కమిటీ పెద్దలు ఖాజాహుశ్సేన్, ఇమాంఅరఫత్, గౌస్‌పీరా, పెద్దన్న, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు అత్తార్ జాహెద్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, అఖిల్, మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌ఫైజ్ తదితర ముస్లింసోదరులు పాల్గొన్నారు.

గట్టెక్కిన మొక్కజొన్న రైతన్న!

- అకాల వర్షంతో అక్కడక్కడ తగ్గిన దిగుబడులు
- క్వింటాం రూ. 2వేలు మద్దతు ధర ప్రకటించిన ప్రభుత్వం
- గిట్టుబాటు ధరతో బాధిత రైతులకూ ఊరట



కోవెలకుంట్ల సమీపంలో మొక్కజొన్న దిగుబడులను ఆరబోసిన దృశ్యం

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్‌సీజన్‌లో జిల్లాలో మొక్కజొన్న సాగు రైతులకు అన్ని విధాలా కలిసోచ్చింది. దిగుబడులు ఆశాజనకంగా రావడంతో రబీ సీజన్‌లో ఇదే పంట సాగుపై రైతులు ఆసక్తి కనబరిచారు. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో రబీలో 17,752 ఎకరాల్లో మొక్కజొన్న సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఆయా మండలాల్లో 5,703 ఎకరాల్లో సాగైంది. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ లోని అవుకుమండలంలో 1,173 ఎకరాలు,సంజామల - 855 ఎకరాలు, కోవెలకుంట్ల - 603 ఎకరాలు, కొలిమిగుండ్ల మండలంలో 59 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. 105 నుంచి 110 రోజులు పంటకాలం కాగా విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, నూర్పిడి తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 15 వేలు వెచ్చించారు.మొక్కజొన్న కోత, నూర్పిడి పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి.

వడగండ్ల వర్షంతో తగ్గిన దిగుబడులు

ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు 28 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడులు రావడంతో రబీసీజన్‌లో కూడా అదే స్థాయిలో దిగుబడులు వస్తాయని రైతులు భావించారు. పైరు చేతికందే తరుణంలో గత నెలలో వడగండ్ల వర్షం బీభత్సం సృష్టించింది. వడగండ్లు, ఈదురు గాలులు వీయడంతో పైరంతా నేలవాలి నష్టం చేకూరింది. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ మండలాల్లో మొక్కజొన్న రైతులకు నష్టం వాటిల్లింది. సాధారణంగా ఎకరాకు 25 నుంచి 28 క్వింటాళ్ల దిగుబడులు వచ్చేవి. అకాల వర్షం కారణంగా ఎకరాకు 15-18 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. పైరు నేలవాలడంతో యంత్రం సాయంతో నూర్పిడి చేసేందుకు అస్కారం లేకపోవడంతో కూలీల సాయంతో కోతలు చేపట్టారు. కూలీల రూపంలో ఎకరాకు రూ. 3 వేల వరకు అదనపుభారం పడింది. అయితే వర్షం కురియని మండలాల్లో దిగుబడులు ఆశాజనంగా లభించాయి. ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడులు వచ్చినట్లు రైతులు పేర్కొంటున్నారు.

ఊరటనిస్తున్న గిట్టుబాటు ధర

ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే ఇతర పంటలతోపాటు మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధర ప్రకటించింది. క్వింటాంకు రూ. 2వేలు మద్దతు ధర ఉండటంతో రైతులు విస్తారంగా మొక్కజొన్న సాగు చేశారు. అకాల వర్షంలేని ప్రాంతాల్లో రైతులకు పెట్టుబడులు పోను నికర ఆదాయం చేకూరగా వర్షం కురిసి దిగుబడులు తగ్గిన మండలాల రైతులు నష్టపోయారు. దిగుబడులు కాస్త తగ్గినా గిట్టుబాటు ధరతో గట్టేక్కే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంటున్నారు. ప్రస్తుతం దిగుబడులను కల్లాల్లో ఆరబోసుకుని విక్రయించేందుకు సన్నద్ధమవుతున్నారు రైతులు.

అకాల వర్షంతో కొంతమేర నష్టం



రెండెకరాల సొంతపొలంతోపాటు మరోమూడెకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశా. దురదృష్టవశాత్తూ పంట చేతికందే సమయంలో వడగండ్ల వర్షం పడింది. అకాల వర్షంతో కొంతమేర నష్టం వాటిల్లింది. ఎకరాకు ప్రస్తుతం 16 నుంచి 18 క్వింటాళ్ల మాత్రమే వచ్చాయి.

– రామసుబ్బయ్య, రైతు, అమడాల, కోవెలకుంట్ల మండలం

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఈ ఏడాది పప్పుశనగ, జొన్న దిగుబడుల విక్రయానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. మొక్కజొన్న క్వింటా రూ. 2 వేలు ధర పలుకుతోంది. దళారుల బెడద లేకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే అమ్ముకునేందుకు వీలుంటుంది.నాకున్న రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను.

– వెంకటేశ్వర్లు, రైతు, జోళదరాశి, కోవెలకుంట్ల మండలం

మంచి దిగుబడులే వచ్చాయి



ఈఏడాది ఖరీఫ్,రబీ సీజన్లలో మొక్కజొన్న పంటలో మంచి దిగుబడులే వచ్చాయి. వడగండ్ల వర్షం కురిసిన ప్రాంతాల్లో మాత్రం కాస్త దిగుబడులు తగ్గాయి. మండలంలో 855 ఎకరాల్లో రబీ సీజన్‌లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. పెట్టుబడులు ఎకరాకు రూ. 15 వేల నుంచి రూ. 18 వేలు వెచ్చించారు. ఎకరాకు 25 నుంచి 28 క్వింటాళ్ల మేర దిగుబడులు లభించాయి.

– సుధాకర్‌రెడ్డి, ఏఓ, సంజామల

నేటి నుంచి మంత్రి బుగ్గన పర్యటన



డోన్ : ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ నియోజక వర్గంలో నేటి నుంచి మూడురోజుల పాటు పర్యటించనున్నారు. గురువారం ఉదయం డోన్‌కు చేరుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలతో మంత్రి సమావేశం కానున్నారు. సాయంత్రం డోన్ నుంచి వెంకటనాయుని పల్లె గ్రామం వరకు 3 కి.మీ మేర రూ. 3.50 కోట్లతో నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తారు. శుక్రవారం ప్యాపిలి మండలం ఎస్. రాచర్ల నుంచి కంబగిరి స్వామి దేవాలయం వరకు నిర్మించిన రహదారులు ప్రారంభించి దేవాలయ నిర్మాణం పనులను పరిశీలిస్తారు. అనంతరం ప్యాపిలి మండలం ఉశ్వేనాపురం వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణం పనులను పరిశీలిస్తారు. అదేవిధంగా శుక్రవారం డోన్ మండలం దేవర బండ, మిద్దెపల్లె మీదుగా ఎద్దుపెంట వరకు వేసిన రోడ్డును మంత్రి ప్రారంభిస్తారని పీఆర్ ఏఈ మహేష్ తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

బేతంచెర్ల: మార్చి 28న ఆటోలో నుండి ప్రమాదవశాత్తూ కిందపడిన ప్యాపిలి మండల బావిపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. ఏఎస్‌ఐ లింగమయ్య వివరాల మేరకు శ్రీనివాసులు బేతంచెర్ల మండలం సీతారామపురం గ్రామంలో లక్ష్మిని వివాహం చేసుకున్నాడు. గత నెల 28 సీతారామాపురంలో జరిగన గంగమ్మ జాతరకు వచ్చి తిరిగివెళ్తూ గ్రామ సమీపాన ఆటోలో నుంచి ప్రమాదవశాత్తు కిందపడడంతో గాయాలు అయ్యాయి. బాధితుని చికిత్స నిమిత్తం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ దేవర



పూజలందుకుంటున్న పెద్దమ్మ,చిన్నమ్మ

బనగానపల్లెరూరల్: మండలంలోని అప్పలాపురం గ్రామంలో పెద్దమ్మ దేవరను గ్రామ రైతు సంఘం, పెద్దల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో శ్రీ పెద్దమ్మ, చిన్నమ్మలను ముస్తాబు చేశారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి భక్తులు భోనాలను నైవేద్యంగా సమర్పించి తమ మొక్కుబడులు చెల్లించారు.ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎంపీ పోచాబ్రహ్మనందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పారవికిశోర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబులరెడ్డి, సోదరులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి తదితర రాజకీయ ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి



గూటుపల్లెలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న , వైస్ ఎంపీపీ రంగస్వామి

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందజేస్తూ సంక్షేమ సారథిగా నిలిచారని వైస్ ఎంపీపీ రంగస్వామి, గూటుపల్లె సర్పంచ్ శ్రీరాములు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గూటుపల్లె, ఆర్ఎస్ రంగాపురం, బుగ్గానిపల్లె, హెచ్ కొట్టాల, ఎం, పేండేకల్లు, గోరుమానుకొండ, కొలుములపల్లె గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో కౌన్సిలర్ మహేశ్వరీ, వైఎస్సార్‌సీపీ నాయకులు నిరంజన్, వలీబాషా, రామనాయుడు, బుగ్గానిపల్లె నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మధు ఆధ్వర్యంలో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో యాజమాన్యాల అనుమతితో వారి ఇళ్లకు నువ్వే మా నమ్మకం జగనన్న స్టిక్కర్లను అతికించారు.

ప్యాపిలి: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని చంద్రపల్లి సర్పంచ్ జొన్నగిరి సరోజమ్మ అన్నారు. బుధవారం చంద్రపల్లి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు చేరాలన్న ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చే శారన్నారు. యాజమాన్యాల అనుమతితో వారి గృహాలకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు భాస్కర్‌రెడ్డి, దేవముని పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభించిన నాయకులు

డోన్ టౌన్: స్థానిక గుత్తి రోడ్డులో ఉన్న రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేసారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పులిశేఖర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సభ్యులు సుగుణమ్మ, నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సభ్యులు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి

కొలిమిగుండ్ల: జాతీయ ఉపాధి హామి పథకం కింద గ్రామాల్లో ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీ సాంబశివరావు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బరాజుతో కలిసి ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వేసవిని దృష్టిలో ఉంచుకొని నీడ కల్పించాలని సిబ్బందికి సూచించారు. వడ దెబ్బ సోకకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు. ఎక్కువ మంది కూలీలకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అమృత్ సరోవర్ పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ గంగన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ సిరులు

- అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ ఫలాలు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



షేక్ జాస్మిన్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి వర్తించిన పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కోవెలకుంట్ల: ప్రజల అభ్యున్నతికి వివిధ పథకాలను ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ ఏదోరూపంలో సంక్షేమ సిరులు అందజేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని రెండవ గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం ఎమ్మెల్యే 'గడప గడపకు మనప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి తదితర నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే కాటసాని ఆయా కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. దాదాపు 550 కుటుంబాలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ మూడున్నరేళ్ల పాలనలో అమలు చేసిన పథకాలను వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి ఇంకా ఏవైనా పథకాలు అందాల్సి ఉందా అనే వివరాలపై ఆరా తీశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఆయా కాలనీల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కార చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు కాటసాని అందజేశారు. లబ్ధిదారులకు ప్రభుత్వం సరఫరా చేసిన సంక్షేమ పథక బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు లోకేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి, ఎంఈఓ తిమ్మారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, ఈఓపీఆర్‌డీ రాధిక, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్‌ఐసీ రామసుబ్బారెడ్డి, సహదేవరెడ్డి, అమడాల భాస్కర్‌రెడ్డి, గుద్దేటి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసనాయక్, సంఘం సుధాకర్‌రెడ్డి, సప్తగిరి నాగేశ్వరరెడ్డి, గడ్డం వరప్రసాదరెడ్డి, రఘునాథరెడ్డి, అక్బర్‌బాషా, గజ్జెలరెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి, నాట్ల వెంకటేశ్వరరెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ వ్యవస్థతో నేరుగా పథకాలు

సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా లబ్ధిదారులకు నేరుగా ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్ట, నష్టాలను స్వయంగా తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే నవరత్న పథకాల ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచారన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి పథకాలను వర్తింప చేస్తున్నారన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు తదితర పథకాలను వర్తింపచేస్తూ మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారని వివరించారు. టీడీపీ గత ఐదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుంటే ఓర్వలేక ఆ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముగిసిన చెన్న కేశవస్వామి బ్రహ్మోత్సవాలు

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటలో వెలసిన చెన్న కేశవస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బుధవారం ఉదయం ఆలయ ఈఓ మద్దిలేటి, మాజీ చైర్మన్లు ఈవీ సుజాత శర్మ, ఆలయ కమిటీ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, హుసేన్ రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా పూర్ణాహుతి నిర్వహించారు. వసంతోత్సవం తోపాటు, పారువేట కార్యక్రమంతో చెన్న కేవవస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని 5వ తేదీన సీతారామాంజనేయ భజన సంఘంలో ఆధ్వర్యంలో ప్రారంభమైన శ్రీరామ నామ అఖండ సప్తాహము ముగిసింది. ఆలయ కమిటీ సభ్యులు, దాతలు బుగ్గన చంద్రశేఖర్ రెడ్డి, పద్మావతమ్మ దంపతులు ఆధ్వర్యంలో భజన సంఘాల సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మారుతి కృష్ణ, బాల నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సత్తాచాటిన కొత్తూరు వృషభాలు



ప్రథమ స్థానంలో నిలిచిన వృషభాల యాజమానికి నగదు అందజేస్తున్న నాయకులు

బేతంచెర్ల : పట్టణంలో వెలసిన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్థానిక శేషారెడ్డి హైస్కూలు మైదానంలో రాష్ట్రస్థాయి పాలపండ్లు, ఆరు పండ్లలోపు వృషభరాజములకు బండలాగుడు పోటీలను బుధవారం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రైతు సంఘం నాయకులు లక్ష్మిరెడ్డి, హుసేన్ రెడ్డి పోటీలను ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీలో పాణ్యం మండలం కొత్తూరు గ్రామానికి సుబ్రమణ్యేశ్వర్‌రెడ్డి వృషభాలు సత్తాచాటి ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా పాముల పాడు మండలం, గుమ్మలూరు వృషభాలు ద్వితీయ , వైఎస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు మండలం, నాగాయపల్లె చంద్ర విజయ కుమార్ రెడ్డి తృతీయ స్థానాల్లో నిలిచాయి. అనంతపురం జిల్లా, ఎల్లనూర్ మండలం, చెలమ కూర్ సుదర్శన్ నాల్గవ, తెలంగాణా రాష్ట్రం, నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన లింగాల మండలం, రాయవరం రామచంద్రారెడ్డి వృషభాలు ఐదవ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేత వృషభాల యాజమాన్యాలకు వరసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ.15 వేల చొప్పున దాతల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీధర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు రామతిమ్మారెడ్డి, లక్ష్మిరెడ్డి, నాగభూషణం రెడ్డి, సంజీవుడు, రామ్ మోహన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, రామాంజనేయులు, రఘురామిరెడ్డి, అన్నారావు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



నాడు కంబగిరి స్వామి ఎస్ రాచెర్ల రోడ్డు దుస్థితి



నేడు మెరుస్తున్న ఎస్ రాచెర్ల, కంబగిరి స్వామి రహదారి



నాడు దేవరబండ నుంచి మిద్దెపల్లె, ఎద్దుపెంట రోడ్డు దుస్థితి



నేడు కళకళలాడుతున్న దేవరబండ, ఎద్దుపెంట రహదారి

మెరుస్తున్న రోడ్లు!

డోన్ : నంద్యాల జిల్లాలో డోన్‌ను మోడల్ నియోజవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు. ప్రజాసంక్షేమ, అభివృద్ధితోపాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏళ్లతరబడి కనీసం మరమ్మతులకు నోచుకోని రహదారుల రూపురేఖలు మార్చుతున్నారు. ఇప్పటికే చాలా వరకు సీసీ రోడ్లు, పొలం రహదారులు నిర్మించారు. దీంతో నాడు అధ్వానంగా ఉన్న రోడ్లున నేడు తలతలమెరుస్తున్నాయి. ప్యాపిలి మండలం ఎస్ రాచెర్ల నుండి కంబగిరి స్వామి ఆలయం వరకు 5 కిలోమీటర్ల రోడ్డును రూ.3.50కోట్లతో నిర్మించారు. ఈ రోడ్డును శుక్రవారం మంత్రి ప్రారంభించనున్నారు. అదేవిధంగా ఎంతో అధ్వానంగా ఉన్న డోన్ మండలం దేవర బండ జాతీయ రహదారి నుంచి మిద్దెపల్లె మీదుగా ఎద్దుపెంట వరకు 4 కిలోమీటర్ల రోడ్డును రూ.2.50కోట్లతో నిర్మించారు. 15వ తేదీన మంత్రి ఈ రహదారిని కూడా ప్రారంభించనున్నారు. అనేక గ్రామాల లింకు రోడ్లతోపాటు ప్రధాన రహదారులను నూతనంగా పునర్ నిర్మించడంతో నియోజకవర్గ ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : సచివాలయ మహిళా పోలీసులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం పట్టణ సచివాలయ మహిళా పోలీసులతో జరిగిన సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. మహిళా పోలీసులు కేవలం సచివాలయాలకే పరిమితం కాకుండా పట్టణంలోని పలు కళాశాలల వద్ద జరుగుతున్న ఈవ్‌టీజింగ్ అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. సచివాలయాల పరిధిలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలను అరికట్టడంలో కీలకపాత్ర వహించాల్సి ఉంటుందన్నారు. మహిళలతో మమేకం కావాలని, వారికి అన్నివిధాలుగా అండగా నిలువాలని సూచించారు.

ప్రజా కళాకారుడు సఫ్దర్ హష్మీ

డోన్ టౌన్: వీధి నాటికలను పోరాట ఆయుధంగా మలచిన ప్రజా కళాకారుడు సఫ్దర్ హష్మీ అని ప్రజా నాట్యమండలి జిల్లా కన్వీనర్ కొయిలకొండ నాగరాజు అన్నారు. హష్మీ 69వ జయంతిని పురస్కరించుకుని స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. హష్మీ విద్యార్థి దశ నుంచే ఎస్ఎఫ్ఐ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ పెత్తందార్లకు వ్యతిరేకంగా పోరాడారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

అంతరిక్ష యానం ఓ అద్భుతం

డోన్ టౌన్: అంతరిక్ష యానం ఓ అద్భుతం అని హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. అంతరిక్ష యాన దినోత్సవాన్ని పురష్కరించుకొని పాతపేట హైస్కూల్లో బుధవారం తొలిసారి అంతరిక్షంలోకి అడుగు పెట్టిన యూరి గగారిన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. 1961 ఏప్రిల్ 12న యూరి గగారిన్ అంతరిక్షంలోకి వెళ్లినందున అంతరిక్షయాన దినోత్సవం జరుపుకుంటున్నట్లు హెచ్ఎం విద్యార్థులకు వివరించారు.